క్లుప్తంగా

ఘనంగా వేణుగోపాలుని కల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కె.గంగవరం: గ్రామంలోని గోపాలస్వామివారి ఆలయం వద్ద మంగళవారం రాత్రి రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణ బ్రహ్మ బిక్కవోలు కేశవాచార్యుల బ్రహ్మత్వంలో వేదపండితులు స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణం సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ, సొసైటీ అధ్యక్షుడు ఈదర రమేష్, చైర్మన్ అనుసూరి ప్రసాద్, ఈఓ ఎంవీవీ సత్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు పట్టణంలో గడప గడపకూ...

రామచంద్రపురం: పట్టణంలోని 16వ వార్డు చప్పిడి వారి సావరంలో మిగిలిన ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం జరుగుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పార్టీ కార్యాలయ ప్రతినిధి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త పిల్లి సూర్యప్రకాష్ పాల్గొనే ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేడు ఏడిదలో ఆసరా పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ఏడిదలో గురువారం వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులైన డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చెక్కుల పంపిణీ సమావేశం నిర్వహించనున్నట్టు ఈఓపీఆర్డీ ఐదం రాజు బుధవారం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.గంగవరం: మండలంలోని శివల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.విజయానంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని శివల, దంగేరు, పేకేరు, భట్లపాలిక, తాళ్లపోడు, మసకపల్లి, యర్రపోతవరం, గుడిగళ్ల బాగ, బాలాంత్రం, అద్దంపల్లి, కుడుపూరు తదితర గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చెట్ల కొమ్మలు తొలగించడం నేపథ్యంలో విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం 33/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప, తాళ్లరేవు మండలాల్లోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. గురువారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు. గొల్లపాలెం ఎస్ఎస్ హెచ్‌క్యూ ఫీడర్ పరిధిలోని కాజులూరు మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం, కరప మండలం గొర్రిపూడి గ్రామాలకు, కోలంక 11 కేవీ ఫీడర్ పరిధిలోని కోలంక, నామవానిపాలెం, చలివేంద్రపాడు, పాలమూరుపాడు తదితర గ్రామాలకు తాళ్లరేవు మండలం ఇంజరం సబ్‌స్టేషన్ పరిధిలోని దుగ్గుదుర్రు, ఉప్పుమిల్లి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ప్రజలు సహకరించాలన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు రాట ముహూర్తం


రాట ముహూర్తం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రాయవరం: సోమేశ్వరంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం చేశారు. మార్చి 8వ తేదీన మహా శివరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో రాట ముహూర్తం చేసి, పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. వర్తక సంఘం సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపొలం రామాలయం వద్ద బుధవారం ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్రబాబు ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కట్టా గోవిందు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యం కల్పించిన గొప్ప వరమని అన్నారు. ఓటు హక్కును ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీటీసీ పంపన ఏడుకొండలు, ఉప సర్పంచ్ వల్లు శివ, కానిస్టేబుళ్లు సత్తిబాబు, సుధాకర్, వార్డు సభ్యులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నింటికీ ఆధారం

- సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు
- ఆధార్ నవీకరణతోనే ప్రభుత్వ పథకాల లబ్ధి
- 19వ తేదీ నుంచి 23 వరకూ ప్రత్యేక శిబిరాలు


నేలటూరు శిబిరంలో ఆధార్ నవీకరణ చేస్తున్న దొరబాబు(ఫైల్)

కపిలేశ్వరపురం: ప్రస్తుతం ఆధార్ నంబర్ చేయించుకోవడం అత్యవసరమవుతోంది. చిరునామా తెలియజేయాలన్నా, ప్రభుత్వ పథకాలు పొందాలన్నా ఆధార్ తప్పనిసరిగా ఉండాలి. ప్రభుత్వం ఇచ్చే సాయం పొందేందుకు నిర్దేశించిన నియమాలు ఆధారంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం లబ్ధిదారుని వివరాలు ఆన్‌లైన్‌లో సక్రమంగా ఉండాలి. ప్రభుత్వం పేదలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న నేపథ్యంలో వాటిని పొందేందుకు ఎలాంటి సాంకేతిక సమస్యలు అడ్డుకాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ ప్రత్యేక ఆధార్ నవీకరణ శిబిరాలను నిర్వహిస్తోంది. 2023 అక్టోబర్ 25 నుంచి దశల వారీగా కేంద్రాలను పెంచుకుంటూ నవీకరణ ప్రక్రియను వేగవంతం చేస్తోంది. దాని కొనసాగింపులో భాగంగా గతేడాది ఆగస్టు 22 నుంచి 25 వరకూ మరోమారు ప్రత్యేక శిబిరాలను నిర్వహించింది. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం నేటి నుంచి 23 వరకూ మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. సచివాలయాల్లో నిర్వహించబోయే శిబిరాల్లో సేవలపై ఈ కథనం...

నవీకరణ ఎందుకంటే..

పదేళ్ల క్రితం ఆధార్ చేయించుకున్న వారి వివరాల్లో మార్పులు ఉండడం, వేలిముద్రలు పడకపోవడం, గతంలో ఆధార్ చేసినప్పుడు వివరాలు తప్పుగా నమోదు కావడం జరిగి ఉండొచ్చు. వాటి వల్ల ప్రభుత్వ పథకాలను పొందడంలో తీవ్రమైన సమస్యలు తలెత్తుతుంటాయి. ఈ నేపథ్యంలో నవీకరణ చేసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోరుతున్నాయి. వేలి ముద్రలు, ఐరిష్, ఫోటో, వయస్సు, ఇంటి అడ్రస్ తదితర వివరాలను నవీకరించుకోవాల్సి ఉంది.

ఆధార్ ప్రత్యేక శిబిరాలిలా...

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో మండలానికి రెండు శిబిరాలు చొప్పున నాలుగు రోజుల పాటు తర్ఫీదు పొందిన డిజిటల్ అసిస్టెంట్లు నవీకరణ చేస్తారు. కపిలేశ్వరపురం మండలంలో 20, 21 తేదీల్లో కపిలేశ్వరపురం-1, మాచర, నేలటూరు సచివాలయాల్లోనూ, 22, 23లలో పడమర ఖండ్రిక, కోరుమిల్లి, కాలేరు సచివాలయాల్లోనూ శిబిరాలను నిర్వహిస్తున్నారు.

నవీకరణ ప్రక్రియ ఇలా...

ఆధార్ కార్డుల జారీ సంస్థ యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏ) సంస్థ నవీకరణకు నిబంధనలను విడుదల చేసింది. ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవాలనుకునే వారు సమీపంలో ఆధార్ సేవలందిస్తున్న సచివాలయ కేంద్రానికి వెళ్లాలి. పుట్టిన తేదీని సరిచేసుకునేందుకు రుజువుగా పదో తరగతి మార్క్స్ మెమో, పాస్‌పోర్టు, పాన్‌కార్డులను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. చిరునామా మార్పు కోసం బ్యాంక్ ఖాతా, పోస్టాఫీసు ఖాతా, రేషన్ కార్డు, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు అప్‌లోడ్ చేయాలి. చిన్నారులకు వారి తల్లిదండ్రుల వేలిముద్రలతో కార్డు జారీ చేస్తారు. ఐదేళ్లు పూర్తయిన తర్వాత మాత్రమే పిల్లల వేలిముద్రలు, ఫోటో అప్‌డేట్ చేస్తారు. తొలిసారి ఆధార్ చేసుకునే పిల్లలకు ఉచితంగా చేస్తారు.

ఆధార్ కార్డుల నేపథ్యమిలా..

తొలిసారిగా 2011లో కేంద్ర ప్రభుత్వం కార్డులను జారీ చేసింది. అప్పటి నుంచి నవీకరణ పెద్ద సమస్యగా ఉండేది. పన్నెండేళ్లకు ఒకసారి ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని ఇటీవల కేంద్రం స్పష్టం చేసింది. 2010–2016 లోపు ఆధార్ పొందిన ఆరు మధ్యలో అప్‌డేట్ చేసుకోకుండా ఉంటే తప్పకుండా అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. 15 ఏళ్లు నిండిన పిల్లలందరి ఆధార్‌ను సవరించాలన్నది లక్ష్యంగా ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. మీసేవా కేంద్రాలకు ఆ అవకాశం ఇచ్చినప్పటికీ అధిక రుసుం వసూలు చేయడం, సర్వర్ సమస్యలు, కేంద్రాల నిర్వాహకుల్లో అవగాహన లోపాలు కారణంగా ప్రజలు నవీకరణ ఆలోచన చేసేవారు కాదు. సచివాలయ వ్యవస్థ రావడంతో అవగాహన పెంచుకున్న ప్రజలు స్థానికంగానో, సమీపానో ఉన్న సచివాలయాన్ని సంప్రదించి నవీకరణ చేసుకుంటున్నారు.

శిబిరాలను వినియోగించుకోండి



కపిలేశ్వరపురం-1, టేకి-1, వల్లూరు సచివాలయాల్లో ఆధార్ నవీకరణ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశాం. ఆధార్ అప్‌డేట్ చేయించుకోనివారి శిబిరాలను సందర్శించవచ్చు. ప్రభుత్వ పథకాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉండే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ, కపిలేశ్వరపురం మండలం

స్థానికంగానే అప్‌డేట్



నా ఆధార్ కార్డును ఇటీవల నిర్వహించిన ఆధార్ శిబిరంలో అప్‌డేట్ చేయించుకున్నా. ఫింగర్‌ప్రింట్, ఫోటో, మొబైల్ నంబర్లను అప్‌డేట్ చేయించుకున్నాను. గతంలో మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు స్థానికంగానే సేవలందించడం అభినందనీయం.

–పెద్దింశెట్టి రిషిత, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం మండలం

నియోజకవర్గాల్లో 19 నుంచి 25వ తేదీ వరకూ ఆధార్ కేంద్రాలు ఇలా..

మండలం	నేడు శిబిరాలు	గతేడాది ఆగస్టులో నవీకరణలు
ఆర్సీపురం పట్టణం	02	102
ఆర్సీపురం రూరల్	02	54
కె.గంగవరం	02	218
మండపేట పట్టణం	02	02
మండపేట రూరల్	02	284
రాయవరం	02	74
కపిలేశ్వరపురం	03	143
మొత్తం	15	977

ఘనంగా సత్తెమ్మతల్లి జాతర


మండపేటలో జనార్దనస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: కోరుమిల్లిలో మంగళవారం రాత్రి సత్తెమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. బుధవారం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. ఎమ్మెల్సీ తోట తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, ఎంపీటీసీ సుంకర వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ ఆడపడుచులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, పేరాబత్తుల రామకృష్ణ, జాతర ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జనార్దనస్వామి దర్శనం

మండపేటలోని శ్రీదేవి భూదేవి సమేత జనార్దన స్వామిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దర్శించుకున్నారు. అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ 110 సంవత్సరాలకుపైన చరిత్ర కలిగిన రథం నేటికీ స్వామి సేవలో చెక్కు చెదరకుండా నడుస్తుండడం చెప్పుకోతగినదన్నారు. ఆయన వెంట మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ రబ్బాని తదితరులున్నారు.

పంట నమోదు పరిశీలన


పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో ప్రభాకర్

రాయవరం: మండలంలోని చెల్లూరు, కూర్మాపురంలో గ్రామాల్లో రబీ పంటకు సంబంధించిన పంట నమోదు, ఈ-కేవైసీని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ బుధవారం పరిశీలించారు. పంట నమోదు చేయించుకున్న రైతులు ఈ-కేవైసీ తీసుకోవడానికి 23వ తేదీ వరకే గడువు ఉందని ఆయన తెలిపారు. మండలంలో 14,446 ఎకరాల్లో పంట నమోదు పూర్తి చేశామని, అయితే ఇప్పటి వరకు 12,220 ఎకరాలకు సంబంధించిన రైతులు ఈ-కేవైసీని పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన 2,246 ఎకరాలకు సంబంధించిన రైతులు ఈ నెల 23వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన సూచించారు. మండలంలో మొత్తం 85 శాతం పూర్తయినట్లు ఆయన తెలిపారు. పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు ఈ-కేవైసీ చేయించుకుంటేనే పంట నమోదు ప్రక్రియ పూర్తవుతుందన్నారు.

పలువురుకి ఎమ్మెల్సీ, చైర్‌పర్సన్ పరామర్శ


మండపేటలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ, చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): ఆప్తులను కోల్పోయి బాధల్లో ఉన్న మండపేట పట్టణంలోని పలువురు కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి పరామర్శించారు. పడాల సత్యనారాయణ, ముత్తారెడ్డి వాసు, లొల్ల సత్యనారాయణ, ఉప్పరపల్లి శ్రీనివాస్, పి.అప్పారావుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో కౌన్సిలర్ చిట్టూరి సతీష్, గ్రంధి శ్రీనివాసు, అన్నం ప్రసాద్, నాగులపల్లి ఈశ్వరరావు, అత్తిలి సత్యనారాయణ, పిఠాపురం సత్యనారాయణ, తాడి రామారావు, గున్నరాజు సేనాపతి రాము, కర్రి లక్ష్మణరావు, గనిపే భూషణం, పిల్లి శివ కనక వరాలు తదితరులు ఉన్నారు.

పేదల సంక్షేమం కోసం మళ్లీ జగనే కావాలి

రాజ్యసభ సభ్యుడు సుభాష్‌చంద్రబోస్


కార్యకర్తలు, ప్రజలకు సీఎం జగనన్న పథకాలను వివరిస్తున్న రాజ్యసభ సభ్యుడు సుభాష్ చంద్రబోస్

కాజులూరు: రాష్ట్రంలో పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని రాజ్యసభ సభ్యుడు(ఎంపీ) పిల్లి సుభాస్ చంద్రబోస్ అన్నారు. బుధవారం మండలంలోని పల్లిపాలెంలో ఎంపీ పిల్లి సుభాస్‌చంద్రబోస్ పర్యటించి నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. గ్రామంలో అధిక సంఖ్యలో స్థానికులు, మహిళలు ఎంపీ బోస్ తదితర నాయకులకు హారతులిచ్చి స్వాగతం పలికారు. పేద మహిళలు, వృద్ధులను ఎంపీ బోస్ ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వ పథకాలు వారికి సక్రమంగా అందుతున్నది లేనిది ఆరా తీశారు. సీఎం జగనన్న ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్నీ నూరుశాతం అమలు చేయడంతో పాటు ప్రజా అవసరాలకు అనుగుణంగా ఎన్నికల్లో ప్రకటించిన పథకాలు అమలు చేస్తున్నారన్నారు. భారతదేశం మొత్తం మీద ఇంత భారీ ఎత్తున పెద్ద సంఖ్యలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలందరికీ జగనన్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని సగటున ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల వరకూ లబ్ధి చేకూరుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మరలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకోవటం ద్వారా భవిష్యత్తులో మరిన్ని పథకాలను పొందగలుగుతారన్నారు. పార్టీ విజయాలకు కార్యకర్తలు, నాయకులు అంకితభావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, గ్రామ సర్పంచ్‌లు వడ్లపాటి భాస్కరరావు, గుంటూరి అప్పారావు, పిల్లి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ కాజులూరి రవిశంకరరెడ్డి, సిద్ధార్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

- కోఆర్డినేటర్ సూర్యప్రకాష్
- పట్టణంలో గడప గడపకూ..


చప్పిడివారిసావరంలో మహిళకు అభివాదం చేస్తున్న కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్ తదితరులు

రామచంద్రపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి తిరిగి ప్రజల వద్దకు వైఎస్సార్ సీపీ ఓటు కోసం వస్తుందని, ప్రజలు ఆశీర్వదించి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. పట్టణంలోని 16వ వార్డు చప్పిడి వారి సావరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా సూర్యప్రకాష్ పాల్గొని స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కారమయ్యే విధంగా అధికారులతో మాట్లాడారు. ప్రతీ ఇంటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించారు. ఏ పథకం నుంచి ఎంత లబ్ధి చేకూరిందో వివరిస్తూ రాకపోతే ఎందుకు రాలేదో అడిగి తెలుసుకున్నారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు తిరిగి అమలు కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రజలందరూ ఎంతో విజ్ఞులని, తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, తిరిగి రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని సూర్యప్రకాష్ అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట వార్డు మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కౌన్సిలర్ పెంటపాటి దేవి, వైస్ చైర్మన్ కొలమూరి శివాజీ, మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు, కౌన్సిలర్లు పాలపర్తి పావని, బాసిన నాగమణి, సీతారామలక్ష్మి, పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పోతంశెట్టి శ్యామలకృష్ణ, ఉండి సత్తిబాబు, కార్సాల నాగేశ్వరరావు, వలంటీర్లు, గృహసారథులు, పార్టీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఏపీ అగ్రగామి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

రాయవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. నదురుబాద గ్రామంలో బుధవారం ముత్యాలమ్మ ఆలయం, హెల్త్‌కేర్ సెంటర్, సచివాలయం భవనాలను ఆయన ప్రారంభించారు. సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు, మార్కెట్‌కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా చేసుకుని ప్రభుత్వం పాలన సాగించిందన్నారు. రాష్ట్రంలో జరిగిన పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారన్నారు. పరిపాలనను గ్రామ స్థాయికి చేర్చేందుకే ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిందని, అన్ని రకాల సేవలు గ్రామంలో ఒకే చోట ప్రజలకు అందేలా ఏర్పాటు చేశారన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నల్లబిల్లి మంగతాయారు, ఎంపీపీ నవుడు వెంకటరమణ మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధికి చిరునామాగా నిలిచిందన్నారు. కార్యకర్తలకు, నాయకులకు త్రిమూర్తులు భరోసాగా నిలుస్తూ ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారన్నారు. అనంతరం ముత్యాలమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠను, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ హెల్త్‌కేర్ సెంటర్, రూ. 43 లక్షలతో సచివాలయ భవనాన్ని ఎమ్మెల్సీ త్రిమూర్తులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరీఫ్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు నల్లమిల్లి వెంకటరెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధిక సంఖ్యలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెడుపై యుద్ధానికి సోషల్ మీడియా ఆయుధం కావాలి

ఎమ్మెల్సీ తోట పృథ్వీరాజ్


మండపేటలో దిశా నిర్దేశం చేస్తున్న పృథ్వీరాజ్, శివకుమార్

కపిలేశ్వరపురం (మండపేట): ప్రజా సంక్షేమ ప్రభుత్వంపై దాడి చేస్తున్న ప్రజా వ్యతిరేక శక్తులపై యుద్ధానికి సోషల్ మీడియాను ఆయుధంగా చేసుకుని ఉద్యమించాలని ఎమ్మెల్సీ తోట పృథ్వీరాజ్, జిల్లా జేసీఎస్ కన్వీనర్ పాటి శివకుమార్ అన్నారు. మండపేట నియోజకవర్గం స్థాయి సోషల్ మీడియా, జేసీఎస్ కన్వీనర్ల సమావేశం మండపేటలో బుధవారం నిర్వహించారు. నియోజకవర్గంలోని 43 గ్రామాలకు చెందిన జేసీఎస్, సోషల్ మీడియా కన్వీనర్లు 150 మంది హాజరయ్యారు. పృథ్వీరాజ్, పాటి శివకుమార్ మాట్లాడుతూ పేదలకు ఇచ్చే పింఛన్లు, ఆసరా సాయాలను సైతం ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా చిన్న చూపు చూస్తున్నాయన్నారు. అలాంటి దుష్ప్రచారానికి ధీటుగా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా విభాగం సభ్యులంతా అదే సోషల్ మీడియా వేదికగా ఎదుర్కొనాలన్నారు. సంక్షేమాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లడమూ, ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టడమనే కార్యాచరణకు సన్నద్ధంకావాలన్నారు. నియోజకవర్గంలోని పరిస్థితిపై మండపేట పట్టణ, రూరల్ మండలాల కన్వీనర్లు, బందెల సాయిరామ్, యరమాటి వెంకన్నబాబు, కపిలేశ్వరపురం మండల కన్వీనర్ పాలింగి శ్రీనివాస్ చర్చించారు. సమావేశంలో గ్రామ స్థాయి సోషల్ మీడియా కన్వీనర్లు హాజరయ్యారు.

నిస్వార్థ సేవలకు వలంటీర్లే నిదర్శనం


కాజులూరులో వలంటీర్ ఉమాదేవిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్

కాజులూరు: నిస్వార్థ సేవలకు వలంటీర్ల పనితీరే నిదర్శనమని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. బుధవారం కాజులూరులో జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పిల్లి సూర్యప్రకాష్ పాల్గొని మండల గ్రామాలకు చెందిన వలంటీర్లను సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ గత పాలనలో అరకొరగా వచ్చే ప్రభుత్వ పథకాలు సైతం జన్మభూమి కమిటీ సిఫారసుల మేరకు టీడీపీ కార్యకర్తలకే ఇచ్చేవారన్నారు. సామాన్యులకు న్యాయం జరగాలంటే దళారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. అయితే జగనన్న ప్రజాసంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలన్నీ వలంటీర్లు పారదర్శకంగా అమలు చేస్తున్నారని పార్టీలు, వర్గ విభేదాలకు తావివ్వకుండా నేరుగా లబ్ధిదారులకే పథకాలు అందేలా చూస్తున్నారన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ రాగానే అవ్వా, తాతలకు, వికలాంగులకు వలంటీర్ల ద్వారా పింఛను సొమ్ములు నేరుగా వారి ఇళ్లకే అందిస్తున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వలంటీర్ల ద్వారా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ గత టీడీపీ హయాం నుంచి పాతుకుపోయిన దళారీ వ్యవస్థకు చెల్లుచీటీ పలికారన్నారు. భారతదేశం మొత్తం మీద ఇంత భారీ ఎత్తున పెద్ద సంఖ్యలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. జగనన్న సైన్యంగా వలంటీర్లు గ్రామాల్లో ఎంతో గుర్తింపు సాధించారని వారికి ఈ ప్రాధాన్యం నిరంతరం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మరలా వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, పార్టీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్ పోలినాటి సూర్యచంద్రం, మండల గృహసారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, యాళ్ల సత్తిబాబు పాల్గొన్నారు.

పేదలకు ఆసరాగా ప్రభుత్వం


నల్లూరు ఆసరా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట


వల్లూరులో లబ్ధిదారులకు ఆసరా నమూనా చెక్‌ను అందజేస్తున్న పృథ్వీరాజ్ ,జెడ్పీటీసీ, ఎంపీపీ

కపిలేశ్వరపురం: పేద, మధ్యతరగతి ప్రజలకు ఆసరా కల్పించడం ద్వారా రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని నేలటూరు, నల్లూరు, వల్లూరు, కాలేరు, అచ్యుతాపురం గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు డ్వాక్రా రుణమాఫీ నాలుగో విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ మాట్లాడారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు దాసి మీనాకుమారి, కుక్కల వీరన్న, కరుపూడి ఉదశ్రీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమాల్లో ఆసరా తాలూకు లబ్ధి పొందిన వారి వివరాలను ఎంపీటీసీ సభ్యులు పలివెల మధు, పెందుర్తి శిరీష, రుద్రాక్షుల వీరగౌరీకుమారి తదితరులు వెల్లడించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ మహిళలకు రాజకీయాలు నేర్పించానని డాంబికాలు పలికే చంద్రబాబు డ్వాక్రా మహిళలకు చేసినదేమీ లేదన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా పదవీ స్వీకారం చేసిన రోజు నుంచి నేటి వరకూ మహిళాభ్యున్నతి కోసం శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏలేటి గంగరాజు, శనక్కాయల దొరబాబు, చేంబ్రోలు వీరభద్రరావు, కరుపూడి రాంబాబు, శివకుమార్, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.